సాక్షి నల్లగొండ

శనివారం । 6 । జనవరి । 2024



యాదాద్రిలో మాజీ గవర్నర్

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు దర్శించుకున్నారు.

- 8లో



ఉత్సవాలు ప్రారంభం

కేతేపల్లి జపమాలమాత చర్చిలో శుక్రవారం రాత్రి క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

- 8లో



మట్టపల్లిలో నిత్యపూజలు

మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు నిర్వహించారు.

- 10లో

న్యూస్‌రీల్

ఒరిజినల్ కార్డు చూపిస్తేనే ఉచిత ప్రయాణం

నల్లగొండ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జారీ చేసిన తెలంగాణ ప్రాంత అడ్రస్ కలిగిన ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించి కూడా బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ ఎంఎస్ నంబర్ 47 ప్రకారం ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ఆర్డినరీ, మినీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్‌కార్డ్‌తో పాటు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ గుర్తింపు కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలు నివాస అడ్రస్‌తో జారీ చేసిన గుర్తింపు కార్డులు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ సంక్షేమ డైరెక్టరేట్ జారీ చేసిన గుర్తింపు కార్డులను (ఒరిజినల్స్) చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు.

12 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు




పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నకిరేకల్ : జాతీయ యువజన సంఘాల ఆధ్వర్యంలో జిట్టా బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో జిట్టా రాధమ్మ ఫౌండేషన్ సహకారంతో ఈనెల 12, 13, 14 తేదీల్లో భువనగిరిలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు యువజన సంఘాల జాతీయ నేత గుండ్లపల్లి బంగారయ్య తెలిపారు. శుక్రవారం ఆయన నకిరేకల్‌లో క్రీడల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడల్లో గ్రామీణ క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎల్లమల్ల శంకరయ్య, జగదీష్, మేడి మహేష్, తాటిపాముల వెంకన్న, తక్కళ్ల రమేష్, బచ్చలకూరి మధు, కట్ట శంకరయ్య, గుండ్లపల్లి శాంతి, స్వరూప్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొందేందుకు చేనేత, పవర్‌లూమ్ కార్మికులు టీ నేతన్న మొబైల్ యాప్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చేనేత, జౌళి శాఖ ఏడీ ద్వారక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని చేనేత, పవర్‌లూమ్ కార్మికులు, అనుబంధ కార్మికులంతా ఈనెల 15వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

సమైక్యత శిబిరానికి వలంటీర్ల ఎంపిక



వలంటీర్లను ఎంపిక చేస్తున్న కోఆర్డినేటర్

నల్లగొండ రూరల్ : ఈ నెల 14 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనేందుకు మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేశారు. భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంస్కృతిక అంశాల్లో ప్రతిభ కనబర్చిన నలుగురిని ఎంపిక చేసినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మదిలేటి తెలిపారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవోత్సవం చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాద స్వరాన్ని వినిపించారు. ఇక శ్రీస్వామి, అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ముఖమండపం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు గావించారు.

నిలిచిన డిజిటల్ సర్వే

నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో ఐదు నెలలుగా నిలిపివేత

- 80 శాతం పూర్తయినట్లు చెబుతున్న సర్వే సంస్థ
- ఈ విషయంలో అధికారుల వద్ద స్పష్టత కరువు
- డిజిటల్ డోర్ నంబర్ సర్వే పూర్తయితే మున్సిపాలిటీలకు పెరగనున్న ఆదాయం
- కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే సర్వే పూర్తికి అవకాశం



నల్లగొండ టూటౌన్ : గత ప్రభుత్వ హయాంలో పాత మున్సిపాలిటీల్లో చేపట్టిన డిజిటల్ డోర్ నంబర్ సర్వే నిలిచిపోయింది. క్షేత్రస్థాయిలో సర్వే దాదాపు 80 శాతం పూర్తయినట్లు సదరు సంస్థ చెబుతున్నా అసంపూర్తిగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఆ సంస్థ ఐదారు నెలలుగా సర్వే నిలిపివేసింది. ఎందుకు నిలిపివేశారన్న విషయంపై మున్సిపల్ అధికారుల వద్ద స్పష్టత లేదు. సర్వే పూర్తయితే మున్సిపాలిటీలకు ఆదాయం పెరగడంతోపాటు డబుల్ నంబర్లు, ఇంటి అనుమతులు తదితర సమస్యలకు చెక్ పడుతుంది.

పాత మున్సిపాలిటీల్లో..

జిల్లాలోని పాత మున్సిపాలిటీలైన నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో డిజిటల్ డోర్ నంబర్ ఇవ్వాలని ప్రభుత్వం సర్వే చేపట్టింది. మొదట్లో ఈ సర్వేను సీరియస్‌గా తీసుకున్న అప్పటి ప్రభుత్వం ఐదారు నెలల క్రితం సర్వే నిలిపివేయాలని అంతర్గతంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. సర్వే నిక్కచ్చిగా, పారదర్శకంగా చేపడితే పట్టణాల్లోని 90 శాతం మంది భవనాల ఆస్తి పన్ను పెరిగే అవకాశం ఉంది. దాంతో అసెంబ్లీ ఎన్నికల ముందు సమస్యలు తెచ్చుకోవడం ఎందుకు అనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం నిలిపివేసినట్లు తెలిసింది. దాంతో అప్పటి నుంచి డిజిటల్ డోర్ నంబర్ల సర్వే అసంపూర్తిగానే ఉంది. ప్రస్తుతం ఎన్నికలు ముగిసిపోవడం, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడం.. సర్వే ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోవడం లాంటి కారణంగా దీనిపై సందిగ్ధత నెలకొంది.

ఆస్తి పన్నులో తేడాలకు చెక్..

మున్సిపాలిటీల్లో ఇంటి నంబర్ల సమస్య అధికారులను వెంటాడుతోంది. కొన్ని చోట్ల డబుల్ నంబర్ల సమస్యా ఉంది. పేర్లు, ఇంటి నంబర్లు తప్పుగా ఉండి.. ఆస్తిపన్నులోనూ తేడాలు ఉన్నాయి. వాటన్నింటికీ స్వస్తి చెప్పాలనే ఉద్దేశంతో పాటు ఇంటి నంబర్ చూస్తే ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు తెలిపే విధంగా డిజిటల్ డోర్ నంబర్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్వే చేయడానికి ఒక్క నల్లగొండ మున్సిపాలిటీలోనే రూ.1.50 కోట్లు వెచ్చించింది. కానీ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో కాంట్రాక్ట్ సంస్థలు సర్వే పూర్తి చేయలేకపోయాయి.

భవనాలకు పెరగనున్న ఆస్తి పన్ను

డిజిటల్ డోర్ నంబర్ సర్వే పారదర్శకంగా చేస్తే దాదాపు 90 శాతం భవనాల ఆస్తి పన్ను పెరగనుంది. అనుమతి తీసుకోకుండా భవనాలు నిర్మించుకున్న వారితో పాటు, ఒక అంతస్తుకు అనుమతి తీసుకొని మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మించడం, ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని వాణిజ్య దుకాణాలు నిర్మించడం లాంటివి పట్టణాల్లో కోకొల్లలుగా ఉన్న విషయం తెలిసిందే. ఇలాంటి భవనాలకు మున్సిపల్ చట్టం ప్రకారం విధించే పన్నుకు రెట్టింపు వేయాల్సి ఉంటుంది. చేసిన సర్వే వివరాలను మున్సిపల్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేయడం, పన్ను పెరిగిన యజమానులకు నోటీసులు ఇవ్వడం లాంటి ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. తద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది. కానీ సర్వే సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. డిజిటల్ సర్వే విషయమై కొత్తగా వచ్చిన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే ముందుకుపోయే అవకాశం ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

రామాలయంలో పల్లకీ సేవ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, మంగళ వాయిద్యం, ఆరోగ్య తిరుప్పావై ప్రవచనం, ప్రభాత సేవ, గోవింద నామ సంకీర్తనలు, అర్చనలు ఆరగింపు నిర్వహించారు. అదే విధంగా వికాస తరంగిణి భక్తులతో విష్ణు సహస్ర నామ పారాయణం, శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ క్రైం : నేర నియంత్రణలో సీసీ కెమెరాలే కీలకమని ఎస్పీ చందనా దీప్తి పేర్కొన్నారు. శుక్రవారం ఐటీ కోర్ సిబ్బందితో ఆమె మాట్లాడారు. ఏదైనా నేర సంఘటన జరిగినప్పుడు వెంటనే తగిన ఆధారాలు సేకరించేందుకు సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికంగా తగిన సహకారం అందించాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో కెమెరాలు ఉండాలని, వాటిని ఎస్పీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల వల్ల తొలగించిన సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ పట్టణ ప్రాంతాలతో పాటు జిల్లాలోని అన్ని ప్రధాన రహదారుల కూడళ్లలో సీసీ కెమెరాలు పని చేసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశం అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను సిబ్బంది పునరుద్ధరించారు.

‘ప్రజా పాలన’ నేడు ఆఖరు



నల్లగొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

- ఇప్పటి వరకు 5,04,883 దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం కింద ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణకు నేటితో గడువు ముగియనుంది. గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలతో పాటు ఇతర పథకాలకు సంబంధించి మొత్తం 5,04,883 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 953 గ్రామ, వార్డు సభలు నిర్వహించి 4,74,305 మందికి దరఖాస్తులను అందించగా వారి వద్ద నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించి 4,41,869, ఇతర అవసరాల నిమిత్తం 63,014 దరఖాస్తులు వచ్చాయి. శనివారం ఆఖరి రోజు కావడంతో దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. వచ్చిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి పంపించనున్నారు.

పేట మున్సిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ గుర్తింపు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీకి బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ గుర్తింపు లభించిందని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఈ విషయాన్ని సూర్యాపేటలో విలేకరులకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పట్టణాల్లో పారిశుద్ధ్య, పబ్లిక్ కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణపై నిర్వహించిన సర్వేలో మున్సిపాలిటీకి చోటు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

పెన్‌పహాడ్: సోషల్ మీడియాలో పెట్టే పోస్టింగ్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మిషన్ కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం బేటి బచావో బేటి పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.రవి, జెండర్ స్పెషలిస్ట్ కుక్కడపు వినోద్, జూలూరి రేవతి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు నీలగిరి కాంగ్రెస్ కౌన్సిలర్లు



నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్ వెళ్లనున్నారు. ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై అవిశ్వాస సమావేశం ఈనెల 8వ తేదీన ఉండడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లకు పార్టీ నాయకత్వం హైదరాబాద్‌లో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పార్టీ తరఫున హస్తం గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లతో పాటు ఇటీవల బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు కూడా ఈ శిబిరానికి వెళ్లనున్నారు. ప్రస్తుతానికి కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 34కు చేరింది. అవిశ్వాసం నెగ్గేందుకు సరిపడే సంఖ్య చేరుకున్నప్పటికీ పార్టీ ముఖ్య నేత సూచన మేరకు హైదరాబాద్‌లోని గోల్కొండ లేదా మోయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వీరికి ప్రత్యేక వసతి ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈనెల 8న నిర్వహించే అవిశ్వాస సమావేశానికి హైదరాబాద్ నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో వర్గ రాజకీయాలు లేకపోయినా 34 మంది కౌన్సిలర్లు అందరినీ ఒకచోట ఉంచేందుకు శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. క్యాంపు రాజకీయం అనే ప్రచారానికి తావు లేకుండా ఎవరి వాహనాల్లో వారే కౌన్సిలర్లు నగరానికి వెళ్లనున్నారు. కాగా ఇప్పటికే చైర్మన్ అభ్యర్థిత్వంపై ఓ నిర్ణయానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి తనే నేరుగా కౌన్సిలర్లకు సమాచారం చేరవేసినట్లు విశ్వాసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే ప్రచారంలో ఉన్న అభ్యర్థి పేరును ఖరారు చేసినట్లు చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో కౌన్సిలర్ల అందరి సమక్షంలోనే చైర్మన్ అభ్యర్థి పేరును అధికారికంగా మంత్రి ప్రకటించనున్నట్లు తెలిసింది.

పాత కమిటీలతోనే..

ఎస్ఎంసీ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

- మరో ఆరు నెలలు గడువు పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు
- నాలుగేళ్లుగా పాత వారే కొనసాగింపు
- జిల్లాలో 1483 ప్రభుత్వ పాఠశాలలు



నల్లగొండ : పాఠశాలల బలోపేతంతోపాటు విద్యాభివృద్ధిలో భాగస్వాములవుతున్న పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) పాలకవర్గాల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి ఈ కమిటీలను ఎన్నుకోవాల్సి ఉన్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. తాజాగా 2023 నవంబర్ నాటికి రెండేళ్లు పూర్తయినప్పటికీ మరో ఆరు నెలలు పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని 1483 ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసీల పదవీకాలం పెరిగింది. తల్లిదండ్రులు పాఠశాలల నిర్వహణలో ప్రధాన భాగస్వాములు కావాలని విద్యాహక్కు చట్టం ఎస్ఎంసీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో ఆ బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. రెండేళ్లు పదవిలో ఉంటారు. ఆ సభ్యుడి పిల్లలు పాఠశాలను వదిలి వెళ్లితే పదవి కోల్పోతారు.

ఎస్ఎంసీల ఎన్నిక ఇలా..

కమిటీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. కమిటీ విధివిధానాలను వివరించి మొదట ప్రతి తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఆ తర్వాత మరో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఒకరిని చైర్మన్‌గా మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఎక్కువ మంది పోటీ ఉంటే ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు. నాలుగేళ్ల నుంచి ఎస్ఎంసీ ఎన్నికలు లేకపోవడంతో ఆ పాఠశాల్లో చదివే వారు వేరే బడుల్లోకి వెళ్లినా పాతవారే కొనసాగుతున్నారు.

కరువైన పర్యవేక్షణ

చైర్మన్, వైస్ చైర్మన్లు ప్రతిరోజూ విధిగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. మూత్రశాలలు, శుద్ధనీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాలి. ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ జాయింట్ ఖాతాలో వేస్తారు. వీటిని సక్రమంగా వినియోగించాల్సి ఉంటుంది. కానీ ఇటు ఎస్ఎంసీల పాలకవర్గాలు, అటు అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడం లేదనే ఆరోపణలున్నాయి.

దృష్టిసారిస్తే మేలు

కొన్ని బడుల్లో వంట గదులు లేక తరగతి గదుల్లోనే వంట చేస్తున్నారు. ప్రహరీలు లేక రక్షణ కొరవడింది. శుద్ధి చేసిన నీరు అందుబాటులో లేక విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్లా క్రీడా మైదానాలు లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపుపై దృష్టి పెట్టడం లేదు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సందర్భంగా దాతల సహాయంతో అల్పాహారం అందించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు కరువయ్యాయి. ఈ కమిటీల పనితీరు మెరుగుపడితేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు ఉన్నాయి.

నేరుగా ఉపాధి కూలి

- ఈ నెల నుంచే బ్యాంకు అకౌంట్ల ద్వారా డబ్బుల చెల్లింపు
- జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌కు.. ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సిందే
- జిల్లాలో 99.96 శాతం పూర్తయిన ప్రక్రియ
- ఉపాధి పనులు, వేతనాల చెల్లింపుల్లో అక్రమాలు చెక్



నల్లగొండ : ఉపాధి కూలీలకు బ్యాంకుల నుంచే నేరుగా కూలి చెల్లింపులు జరగనున్నాయి. పోస్టాఫీస్‌ల ద్వారా డబ్బు చెల్లింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితమే బ్యాంకుల ద్వారా ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలని నిర్ణయించింది. తద్వారా నేరుగా మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా కూలీలకు డబ్బులు అందుతాయనేది ప్రభుత్వ ఉద్దేశం. అందులో భాగంగా ఈ నెల నుంచి నేరుగా ఉపాధి హామీ కూలీల అకౌంట్లలో కూలి డబ్బులు జమ కానున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా..

ఉపాధి హామీ కూలీలకు డబ్బు చెల్లింపులు, హాజరు విషయంలో అక్రమాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో గ్రామ స్థాయిలో ఏరోజుకారోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కూలీలు పనిచేసే చోటే ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో అధిక కూలీలను చూపకుండా కొంత వరకు చెక్ పెట్టింది. మరోవైపు డబ్బులు నేరుగా కూలీల అకౌంట్లలో జమ చేయడం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చనే ఉద్దేశంతో జాబ్ కార్డు, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేయాలని సూచిస్తూ రెండేళ్ల క్రితమే గడువు విధించింది. అయితే ఆధార్ అనుసంధానం చేసుకోవడంలో కూలీలు చాలా వరకు వెనుకబడిపోయారు. ఇటీవల ప్రభుత్వం బ్యాంకుల ద్వారా చెల్లింపులు ప్రారంభించింది. దీంతో కూలీలు పనిచేసినా అకౌంట్లలో డబ్బులు జమ కాలేదు. దీంతో ప్రభుత్వం ఆధార్ అనుసంధానానికి 31 డిసెంబర్ 2023 వరకు గడువు ఇచ్చింది. అప్పటి వరకు ప్రతి ఒక్క ఉపాధి కూలీ ఆధార్ అనుసంధానం చేసుకోవాలని చెప్పింది. జిల్లాలో మొత్తం 4,26,628 జాబ్ కార్డులు ఉండగా ఇప్పటి వరకు 4,26,445 జాబ్ కార్డులకు సంబంధించి కూలీలు ఆధార్ అనుసంధానం చేసుకున్నారు. జిల్లాలో 99.96 శాతం ఆధార్ అనుసంధానం పూర్తయింది.

19 వేల మంది అకౌంట్లు తిరస్కరణ

జిల్లాలో ఆధార్ అనుసంధానం చేసుకున్నా 19 వేల మంది అకౌంట్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మ్యాపర్‌లో తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో 8,900 మంది వరకు ఆధార్ సీడింగ్‌లో తప్పులు ఉండగా మిగతా వారి బ్యాంకు అకౌంట్లు అప్‌డేట్‌లో లేవు. దీంతో వారి అకౌంట్లలో ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో చూపించడం లేదు. వారిలో 16 వేల మంది కూలీలకు సంబంధించిన జాబితాలను ఆయా గ్రామ పంచాయతీలో ఉంచారు. ఆ కూలీలు ఆధార్ సీడింగ్‌తో పాటు బ్యాంకు అకౌంట్ అప్‌డేట్ చేసుకునే విధంగా ఉపాధి సిబ్బంది సహకరించనున్నారు. పది రోజుల్లోగా ఈ ప్రక్రియనంతా పూర్తి చేయనున్నట్లు డీఆర్‌డీఓ అధికారి కాళిందిని తెలిపారు.

ఉపాధ్యాయ కరదీపికపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ సైదిరెడ్డి

నేరేడుచర్ల: పాఠ్య పుస్తకాలు, ఉపాధ్యాయ కరదీపిక, అభ్యాసన పుస్తకంపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉండాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ) ఎ.సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని మండల వనరుల కేంద్రంలో జరిగిన కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్న అనంతరం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు తీరుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాల అమలుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, సత్యనారాయణరెడ్డి, ఆర్పీలు షఫి, శ్రీధర్, పద్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

కోదాడ: పట్టణ పరిధిలోని పశువుల సంత వద్ద గంజాయి సేవించడంతో పాటు అమ్ముతున్న ఇద్దరు పురుషులు, మహిళను పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు రిమాండ్ చేశారు. పట్టణంలోని మాతానగర్‌కు చెందిన చింతల అరవింద్, అంబేద్కర్ కాలనీకి చెందిన కంచెర్ల ప్రదీప్‌లు సంత వద్ద గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరితో పాటు కృష్ణాజిల్లా బుదవాడకు చెందిన షేక్ మస్తాన్‌బీ జగ్గయ్యపేటలో గంజాయి కొనుగోలు చేసి కోదాడలో వీరికి అమ్ముతున్నట్లు తెలిపారు. వీరి వద్ద 30 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాము, ఎస్.రామాంజనేయులు సిబ్బందిని డీఎస్పీ ప్రకాశ్ అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

చిట్యాల: షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామంలో చోటు చేసుకుంది. బోయగుబ్బ గ్రామానికి చెందిన బొల్లం లింగయ్య ఇటీవల తన పాత ఇంటి స్థలంలో నూతన గృహ నిర్మాణ పనులు చేపట్టారు. అ పక్కనే ఉన్న స్థలంలో తాత్కలికంగా గుడిసెను ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులంతా కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో మల్లయ్య నివసిస్తున్న గుడిసెలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. దీంతో గుడిసేలోని నిత్యావసర వస్తువులు, బట్టలు, గృహోపకరణాలతో పాటు ఇటీవల గృహ నిర్మాణానికి పత్తి పంటను అమ్మగా వచ్చిన ఐదు లక్షల రూపాయల నగదు కాలిపోయాయి. గుర్తించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా దహనమయ్యింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో, విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

జూదరుల అరెస్ట్

నల్లగొండక్రైం: వ్యవసాయ భూముల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.27వేల నగదు, నాలుగు ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

చింతపల్లి : ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కిందపడి గాయపడిన గీతకార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చింతపల్లి మండల పరిధిలోని చాకలిశేరిపల్లి గ్రామానికి చెందిన జినుకుంట్ల వెంకటయ్య (50) గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో గీత కార్మిక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం చౌళ్ల తండాలో కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు మాల్‌లోని పీపుల్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు.

క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



ముగ్గురు రాజుల పౌరాణిక నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కేతేపల్లి: కేతేపల్లి జపమాలమాత చర్చిలో శుక్రవారం రాత్రి క్రీస్తు సాక్షాత్కార (ముగ్గురు రాజుల పండగ) వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. చర్చి విచారణ గురువు మాదాను ప్రాంచీస్ అధ్యక్షతన క్రైస్తవ మత గురువులు తమ ప్రార్థనా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించారు. గ్రామంలోని క్రైస్తవ భక్తులందరూ మొక్కులు చెల్లించుకునేందుకు చర్చికి వచ్చి ప్రార్థనలలో పాల్గొన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ వేడుకలలో పాల్గొని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచమానవాళికి ఏసుక్రీస్తు మార్గదర్శకుడని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎదుటివారిని ప్రేమించి మంచి మార్గంలో నడవాలని కోరారు. అనంతరం చర్చి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను వాలువాలు, బొకేలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక చర్చి ఆవరణలో ప్రాచీన పద్ధతిలో ప్రదర్శించిన ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే ముగ్గురు రాజుల నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. వేడుకల ప్రారంభం సందర్భంగా పేల్చిన బాణసంచా ఆకాశంలో రంగు రంగుల కాంతులతో మిరుమిట్లు గొలిపింది. వేడుకల్లో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు పసల శౌరయ్య, సర్పంచ్ జటంగి ముత్తమ్మ, ఉప సర్పంచ్ అవ్వారి హేమలత చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యయ్య, మాదాను బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌రాజు, విజయ్‌కుమార్, ధనరాజ్, పాలిశెట్టి జోజప్ప, శౌరి, గుద్దింటి రాయప్ప, క్రైస్తవులు బందా లూబెల్, కాల్వ శౌరయ్య, పసల రవి, జార్జి, అవ్వారి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన ప్రజలు

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి

నకిరేకల్ : నకిరేకల్‌లోని తిప్పర్తి రోడ్డులో నివాసం ఉంటున్న స్వాతంత్రం సమరయోధుడు, తాటికల్ మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేషం(92) అనారోగ్యంతో గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళి, ఆయా పార్టీల నేతలు, కందాల ప్రమీలా, పన్నాల రాఘవరెడ్డి, రాచకొండ వెంకట్‌గౌడ్, బొజ్జ చిన వెంకులు, వంటేపాక వేంకటేశ్వర్లు, ఏర్పుల తాజేశ్వర్, గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న, గాజుల శ్రీనివాస్, సాకుంట్ల నర్సింహ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు



సీఐ మహేశ్



నిందితుడు అన్వర్

భూదాన్‌పోచంపల్లి : మతిస్థితిమితంలేని మహిళపై అత్యాచారం చేసి, అనంతరం హత్యచేసిన కేసులో నిందితుడికి శుక్రవారం భువనగిరి ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, భూదాన్‌పోచంపల్లి ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది జూన్ 13న అర్ధరాత్రి భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలోని వైన్‌షాపు ఎదురుగా ఉన్న బిల్డింగ్ సెల్లార్‌లో మతిస్థితిమితంలేని మహిళ రంగారెడ్డి జిల్లా బండరావిరాల గ్రామానికి చెందిన సోమని యాదమ్మ(55) నిద్రించింది. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న బిహార్ రాష్ట్రం, ముజఫర్‌పూర్ జిల్లా, దోదిరతన్ గ్రామానికి చెందిన మహ్మద్ అన్వర్(34) ఆమెపై అత్యాచారం చేసి, అనంతరం తలపై బండరాయి మోది హత్య చేశాడు. దాంతో 14న పోలీస్‌స్టేషన్‌లో అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శాస్త్ర సాంకేతిక ఆధారాలతో పరిశోధన ప్రారంభించి నేరస్తుడిని గుర్తించి అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. దాంతో నిందితుడు నేరం ఒప్పుకొనగా అదే నెల 16న భువనగిరి డీసీపీ, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య ఆధ్వర్యంలో చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి కోర్టులో రిమాండ్ చేశా రు. ఈ కేసును ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ కోర్టులో ట్రయల్ జరిపించగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దామోదర్‌రెడ్డి పోలీసుల తరఫున వాదించారు. శుక్రవారం తుది విచారణను రాగా, అన్వర్‌పై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.2వేల జరిమానా విధించింది.

యాదాద్రిలో మాజీ గవర్నర్ నరసింహన్ పూజలు



మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని తెలంగాణ మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. వారికి ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. నరసింహన్ దంపతులకు ఆచార్యులు ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, ఈవో రామకృష్ణారావు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణ అంశాలను మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులకు ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు వివరించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

చందంపేట : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చదంపేట మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చందంపేట మండలంలోని మోత్యతండాకు చెందిన ఇస్లావత్ రవి(36) హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తండాకు వచ్చిన రవి ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలోనే శుక్రవారం పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే రవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చందంపేట ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కార్తీక్

హాలియా: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హాలి యా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తగుళ్ల కార్తీక్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కోడుమూరు వెంకట్రాంరెడ్డి శుక్రవారం తెలిపారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 17 సంవత్సరాల బాలుర కబడ్డీ విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి కార్తీక్ పాల్గొని క్రీడల్లో ప్రతిభ కనబర్చి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డిలో జరగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి కార్తీక్‌ను పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్– 17 కబడ్డీ పోటీలకు ...

నిడమనూరు: అండర్–17 కబడ్డీ పోటీలకు నిడమనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థినులు నాదేండ్ల కీర్తి, షేక్ ఆయేషా, మల్లికంటి గణేష్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రంజిత, పీడీ గిరి శుక్రవాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు కామారెడ్డిలో నిర్వహించే జాతీయ కబడ్డీ పోటీల్లో ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి మల్లికంటి గణేష్ తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు తరపున ఆడనున్నాడని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

పెన్‌పహాడ్ : ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని నాబార్డ్ డీడీఎం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, మాచారం గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అంతర పంటలుగా టమాట, మిర్చి, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిందు సేద్యం పనితీరును తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. నమ్మకమైన నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి తద్వారా మూడు నుంచి నాలుగు రకాల వ్యవసాయ అనుబంధ రంగాల ఆదాయం తీసుకోవచ్చని తెలిపారు. మొదటి మూడు సంవత్సరాల వరకు అంతర పంటలుగా కూరగాయాలు, వేరుశనగ, పత్తి, ఎండుమిరప, బొప్పాయి, అరటి, కోకోవా, మిర్యాలు వంటి తోటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. నాటు కోళ్లు, గొర్రెల పెంపకం, పాడి పరిశ్రమను కూడా చేపట్టవచ్చని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న బిందు సేద్యం రాయితీలను, పామాయిల్ సాగు సబ్సిడీలను, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కొత్త పంట పెరుగుదల బాగుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి కన్నా జగన్, పతంజలి కంపెని జిల్లా మేనేజర్‌హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, డ్రిప్ కంపెనీ డీసీవోలు నరసింహా, అనిల్, గణేష్, మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, రైతులు ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.



సింగారెడ్డిపాలెంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం సత్యనారాయణ

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ టౌన్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 11వ వార్డు నందిపాడు గ్రామానికి చెందిన కప్పల రామారావు దంపతులు గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పట్టణంలోని శాంతినగర్‌లో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా, కబోర్డు పగులగొట్టి వాటిలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు, కిలోన్నర వెండితో పాటు 25వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

బీమాతో ఖాతాదారులకు ధీమా

నల్లగొండ రూరల్: ప్రతి ఖాతాదారునికి బీమాతో పాటు ధీమా లభిస్తుందని పోచంపల్లి బ్యాంకు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడేనికి చెందిన మచ్చా వెంకటేశం పోచంపల్లి బ్యాంకులో రూ.40 వేలతో పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ కోసం బీమా చేయగా మృతిచెందారు. మృతుడి భార్య కవితకు శుక్రవారం నల్లగొండ బ్యాంకులో మేనేజర్ మోహన్‌రావుతో కలిసి లయన్స్ క్లబ్ సభ్యులు కొంగరి బిక్షం పాలసీ చెక్కు అందించారు. ఇప్పటి వరకు బ్యాంకు ద్వారా 18 మందికి బీమా కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శివ, జేబో రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెన్‌పహాడ్ : వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త నరేష్, కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్ రైతులకు సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలో మల్లారెడ్డి యూనివర్సిటీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న వ్యవసాయ విద్యార్థులతో కలిసి వరి పంటను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20రోజుల దశలో ఉన్న వరి పంటలలో ఆశించిన జింక్ లోపం , ఆకు ఎండు తెగులు మరియు అగ్గి తెగులు లక్షణాలు విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. తదుపరి వాటి నివారణకై జింక్ సల్ఫేట్ 2గ్రాముల ప్లంటోమైసిన్ 0.5గ్రా, ట్రైసైక్లోజోల్ 0.6గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పోగ్రామ్ అసిస్టెంట్ నరేష్, రైతులు కె నాగరాజు, ఎల్లయ్య, విద్యార్థులు భానుప్రకాష్, వంశీ, ప్రణయ్, పవన్, చరణ్, అఖిల్ పాల్గొన్నారు.



వరి పంటపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

దరఖాస్తుల ఆన్‌లైన్ పక్కాగా ఉండాలి

- యాదాద్రి కలెక్టర్ హనుమంతు కె.జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు అందజేసిన దరఖాస్తులను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే డేటాఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరుగ్యారంటీల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే విధానంపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు దరఖాస్తులో పేర్కొన్న వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు అనంతరం మరోసారి సరిచూసుకోవాలన్నారు. నమోదు చేసిన తర్వాత వచ్చిన నంబర్ సంబంధిత దరఖాస్తుపై తప్పనిసరిగా రాయాలని సూచించారు. డేటా ఎంట్రీ పూర్తయిన దరఖాస్తులను తిరిగి సంబంధిత సూపర్‌వైజర్లకు అందజేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీపీఓ సునంద పాల్గొన్నారు.

మేళ్లచెరువు గ్రామపంచాయతీ రికార్డులు స్వాధీనం

మేళ్లచెరువు : మేళ్లచెరువు మేజర్ గ్రామపంచాయతీ రికార్డులను శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామపంచాయతీలో రికార్డులు లేకుండా బిల్లులు కాజేశారనే ఆరోపణలతో గ్రామస్తులు, వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, సూర్యాపేట డీయల్‌పీఓ సాంబిరెడ్డి తెలిపారు.అనంతరం విచారణ జరపనున్నట్లు వారు తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి



ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

శాలిగౌరారం: మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వంగాల ప్రతాప్‌రెడ్డి(95) శుక్రవారం మృతిచెందాడు. సింగిల్‌విండో చైర్మన్‌గా, డీసీసీ సభ్యుడిగా, పార్టీ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి పనిచేశారు. ప్రతాప్‌రెడ్డి మృతదేహాన్ని జెడ్పీటీసీ ఎర్ర రణీల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, చిత్తలూరు, వల్లాల సర్పంచ్‌లు మామిడికాయల జయమ్మ, షేక్ ఇంతియాజ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎర్ర చైతన్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వంగాల ప్రతాప్‌రెడ్డికి కుమారులు లేకపోవడంతో మనుమరాలు(బిడ్డ కూతురు) సునిత తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించింది.

శతాధిక వృద్ధుడు మృతి

శాలిగౌరారం: శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని పావురాలగూడేనికి చెందిన మద్ది నర్సింహారెడ్డి(105) వయోభారంతో శుక్రవారం సాయంత్రం ఇంటివద్ద మృతిచెందాడు. మృతుడికి భార్య, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు 15 సంవత్సరాల క్రితం వ్యవసాయ పొలం వద్ద పాముకాటుకు గురై మృతిచెందాడు.

అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలి

మఠంపల్లి: అభయహస్తం పథకం కింద అందించనున్న గ్యారంటీ పథకాలకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని డీపీఓ యాదయ్య కోరారు. శుక్రవారం మఠంపల్లిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని మట్టపల్లి, భీమ్లాతండా, తుమ్మలతండా తదితర గ్రామా ల్లో దరఖాస్తులను స్వీకరణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంగా, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి

చౌటుప్పల్ : పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని డీఈఓ నారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. చౌటుప్పల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకులం, పంతంగి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, సిలబస్‌పై ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే బాషాగణిత సామర్థ్య సాధన జరగాలన్నారు. టెన్త్ విద్యార్థులు 10జీపీఏ సాధించే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని కోరారు.

అవిశ్వాసానికి ముహూర్తం ఖరారు

- భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై చర్చకు అనుమతి
- 23న హాజరుకావాలని కౌన్సిలర్లకు నోటీసులు
- అవిశ్వాసానికి 31మంది అనుకూలం



అదనపు కలెక్టర్ వీరారెడ్డికి సంతకాలతో కూడిన పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

సాక్షి, యాదాద్రి : భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 23న ఉదయం 11గంటలకు జరిగే చర్చకు హాజరుకావాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశాల మేరకు కౌన్సిలర్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు పంపారు. చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతలకిష్టయ్యలపై అవిశ్వాసం పెట్టాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు డిసెంబర్ 30న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డికి నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. నోటీసులోని కౌన్సిలర్ల సంతకాలను కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సంతకాలు సరైనవేనని నిర్ధారించుకుని కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు.

కోరం 24 మంది

అవిశ్వాస తీర్మానంపై జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కోరం ప్రకారం 24 మంది కౌన్సిలర్లు హాజరుకావాలి. 35 మంది కౌన్సిలర్లతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఓటింగ్లో పాల్గొంటారు. కౌన్సిల్‌లో ఉన్న 31 మంది సభ్యులు అవిశ్వాసం కోరుతున్న విషయం తెలిసిందే. సమావేశానికి కోరం కచ్చితంగా ఉండాలి.

నలుగురు మినహా..

భువనగిరి మున్సిపాలిటీలోని 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం కోరుతూ 31 మంది సభ్యులు నోటీసుపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ కౌన్సిలర్లు ఆరుగురు ఉన్నారు. అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైన నేపథ్యంలో మున్సిపల్ రాజకీయం ఆసక్తిరేపుతోంది.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి క్రైం : శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని డీసీపీ రాజేశ్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరిలోని డీసీపీ కార్యాలయంలో స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ కౌన్సిలర్లు, ముఖ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా భువనగిరిలోని హౌసింగ్‌బోర్డు కాలనీని సేఫ్‌గా జోన్‌గా తీర్చిదిద్దేందుకు స్థానికుల సహకారంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత మిగతా వార్డులు, గ్రామాలను కూడా సేఫ్‌జోన్లుగా తీర్చిదిద్దుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్ ఈరపాక నరసింహ, వార్డు అధ్యక్షుడు మొహమ్మద్ అమానతుల్లా, పిన్నింటి బలరాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పాండు, సర్వేశం, శేఖర్ పాల్గొన్నారు.